## ఉగాదికి..స్వాగతం

తెలుగుతల్లి ముంగిట ముత్యాల వాన
ప్రకృతికాంత వాకిట వసంతాల వాన
జల జలా కురిసే రోజు
తెలుగుజాతి మురిసే రోజు
అదే ఉగాది పండుగ రోజు
ఈ శుభవేళ ఈ సుదరవేళ..

తెలుగుతల్లి ఒడిలోన
కవి కోకిలల కవితా గానాలు
ప్రకృతికాంత ఒడిలోన
కల కోకిలల కుహూ కుహూ గీతాలు..

ఎటుచూసినా పచ్చని పచ్చని అందాలు
రంగు రంగుల రమణీయ సుమాలు
చైత్రమాస నవ వసంత శోభలు

వేప తరుణీమణుల పూత సొబగులు
మావి ముదితల ముద్దుగైన జడగంటలు..

చూసిన కనులు సంతసించాయి
ఆనందంతో పులకించాయి
నా కవిహృదయం మురిపించాయి
నాతో సుమధుర గీతం పాడించాయి
ఈ శుభవేళ ఈ సుదరవేళ
ఉగాదికి స్వాగతం సుస్వాగతం



- బూర దేవానందం
8143589789

## ఏమిటా అని పరికిస్తే!......

నీతి నేతి బీర చందమున్నా!
మోసాలసాలు సహజంగానే ఉన్నా!
లెక్కలు తప్పుతున్నా!
తిప్పలు తప్పకున్నా!
స్వార్థ మూ వీడకున్నా!
పంజాబీ యులు "వై సాఖీ"అంటూ!
మహారాష్ట్రీయులు "గుడిపడవా"అంటూ!
అస్సామీయులు "బిహూ"అంటూ!
తమిళులు "పుత్తాండు"అంటూ!
మలయాళీయులు "కొల్లవర్షం"అంటూ!
మన తెలుగు వారు తెలివైన వారు!
కొత్త సంవత్సరం"ఉగాది"అంటూ!
విభిన్న రీతుల్లో ఏకత్వంగా జరుపుకున్నా!
భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలని!
సుమ సౌర భాలతో!
ప్రకృతి పచ్చదనంతో!
లేమావి చిగుళ్ళతో!
వేపూత సోయగాలతో!
వెన్నెల జల్లులతో!
మల్లెల గుబాళింపు తో!
జాతీయతకు వన్నె తెచ్చే రోజున!
ప్రత్యూష వేళ కుహూ రావాలతో!
వీనులకు విందు చేస్తూ!
కోకిలమ్మ నను లేపుతోంది!

చిరుగంటల సవ్వడితో!
లే దూడ చెంగు చెంగున గెంతు లేస్తుంటే!
ఇల్లిల్లూ మామిడి తోరణాలతో
ముస్తాబౌతుంటే!
తీపి, పులుపు, ఉప్పు, కారం చేదు
వగరుల షడ్రుచుల సమ్మేళనం !
నన్నారగించ రమ్మని నోరూరిస్తుంటే!
ఎక్కడో దూరంగా శ్రావ్యమనిపిస్తూ!
అది పంచాంగ శ్రవణమై!
నా చెవిన విందు గావిస్తుంటే!
ఆనందోత్సాహాల మధ్య జనం!
ఘనంగా తమ ఆమోదాన్ని
తెలియ చేస్తుంటే!
ఏమిటా అని పరికిస్తే!......
అప్పుడే...ఇదే...నేటి నిజం! అంటూ!
దినపత్రికలోంచి కొత్తగా జారి పడింది!
నేనే మీ
"శుభ కృత్"నామ (2022)ఉగాది నని!
నేనే మీ జీవితాలకు
సరికొత్త శోభాయ మానమనీ!



-దోస పాటి.సత్యనారాయణ మూర్తి.
9866631877

## నవ జీవన ఉగాది...!

గతరెండు ఉగాదులలో
కరోనాకాటుకు బలియైన
మానవాళి మరణాలెన్నో
ఇలాంటి గత్తర రానీకమ్మా శుభకృత్తు..!

ప్రతిఇంట మావితోరణాలతో
హరితహారానందం కూర్చియు
నూతన వస్త్రధారణతో
ప్రతిఇంట పరిమళించమ్మా శుభకృత్తు...!

వసంతవేళప్రశాంతలీల
మావిచివుళ్ళుతినికోయిలమ్మల
మధురమైనకూహుగానాలు
ప్రకృతిప్రజలకుపరవళ్ళమ్మా శుభకృత్తు...!

ఇంపగు షడ్రుచులపచ్చడి
వడపప్పుపానకం హాయిగాత్రాగి
పంచాగశ్రవణంతో మంచిచెడులు
విన్నమాకందరికి
శుభములుకలుగ దీవించమ్మా శుభకృత్తు..!

సకలప్రజావళి సంతసాలతో
చక్కగకార్యములు సఫలంచేస్తూ
సర్వజనావళి సంబరపడగ
ఆనందడోలికల్లో హాయిగనుండ
ఇష్టదేవతలు యింపునుకూర్చ
దీవించమ్మా శోభకృత్తు...!!



-డా.గన్నోజు శ్రీనివాసాచారి
8555899493,

# రసమయమైన రావి ఉగాది కవితలు

ఆధునిక తెలుగు కవిత్వంలో ఉగాదిని స్వాగతిస్తూ కవిత రాయని కవి ఉండడు. రాయప్రోలు, కృష్ణశాస్త్రి, జాషువ, శ్రీశ్రీ, కరుణశ్రీ, అనిసెట్టి, ఆరుద్ర, దాశరథి, సినారే మొదలైన కవులంతా సామాజిక సమస్యలను ఉగాది కవితల్లో సమన్వయం చేస్తూ కవితలు రాశారు. డా. రావి రంగారావు కవిత్వ సవ్యసాచిలా అయిదు దశాబ్దాలుగా పద్య కవిగా హృద్యమైన పద్యాల్లో... అభ్యుదయ భావాలు పలికించిన జాషువా, తుమ్మల మొదలైన కవుల్లా... అమృత వృక్షం, అశ్వత్థ వృక్షం మొదలైన పద్య కవితా గ్రంథాలను ప్రచురించారు. మినీ కవితా ఉద్యమ సారథిగా వెయ్యికి పైగా మినీ కవితలు రాశారు. ఎన్నో వచన కవితల సంపుటాలను, బాల సాహిత్య గ్రంథాల్ని, సాహిత్య విమర్శ గ్రంథాల్ని, బోధనా శాస్త్ర పరిశోధనలను కూడా ప్రచురించారు. ఎందరో మినీ కవితలు రాయటానికి స్ఫూర్తి నిచ్చి ప్రేరేపించారు. వందల కొలది కవుల మినీ కవితలతో సంకలనాలు కూడా ప్రచురించారు. ఆయన మినీ కవితలు ప్రేరకాలుగా తరువాత వచ్చిన నానీలు, రెక్కలు మొదలైన లఘు కవితా ప్రక్రియలు ప్రాచుర్యం పొందాయి.










రంగారావు వచన కవితలు శైలీ సౌందర్యంతో పాటు పాఠకులకు సద్యఃస్ఫూర్తి కలిగించే దృష్టాంతాలతో ఆకర్షిస్తాయి. ఆయన రాసిన వచన కవితా సంపుటాలలో "సూర్యుడిని నెత్తి కెత్తుకొని", "గుండెలో నదులు నింపుకొని", "కొత్త క్యాలెండర్", "కొత్త సూర్యుళ్ళు మొలిచి తీరాలి" మొదలైన సంపుటాలలోని కొన్ని ఉగాది కవితల్ని విశ్లేషించడం ప్రస్తుత వ్యాస ఉద్దేశం.

"కాలం ఒక అనంతమైన మహోన్నత పర్వతం / మనుషులు మాత్రం పడుతూ లేస్తూ శిఖరం చేరాలనే నిరంతర ప్రయత్నం" అన్నారు. కాలం మానవుడిని ఆకర్షించే నాట్యకత్తె మేనక. కాల గమనంలో మానవుడు ఎన్నో ఆకర్షణలకులోనై గమ్యాన్ని సాగించడం సహజం. మనుషులు ఆశావహ దృక్పథాన్ని త్రిశంకు స్వర్గాన్ని సృష్టించే తపో భంగమైన విశ్వామిత్రుడితో పోల్చారు.

"ఉగాది అంటే ఏమిటి" అనే ఖండికలో "కాలం గుండెలో నాటిన పచ్చని మామిడి చెట్టు/ మనుషులకు వసంతం పంచుతున్న మామిడి పండు" అని ఉగాదిని వర్ణిస్తారు. ఉగాది పచ్చడి తీపి పులుపుల కలయిక. సుఖ దుఃఖాలు మంచి చెడులకు ప్రతీక. ఉగాదికి మామిడి పండుకు ఉన్న సంబంధాన్ని అద్భుతంగా కవిత్వీకరించారు. "కాలానికి వసంతం పెట్టుబడి/ సూర్యుడు దున్నబోయే ఉగాది మడి" అంటారు. ఋతువు లన్నిటిలో వసంతానికి విశిష్టత ఉంది. వసంతంలో ఉగాది వస్తుంది. ప్రకృతి పారవశ్యంతో కోకిల స్వర మాధుర్యం వినిపిస్తుంది. అందుకే కాలానికి వసంతం పెట్టుబడిగా భావించారు రంగారావు. కాల పురుషుడికి సూర్యుడు ప్రతీక. అందుకే సూర్యుడు దున్నబోయే ఉగాది మడిగా ఉపమించారు. సూర్యుడు కాలానికి సంకేతం, చైతన్యానికి ప్రతీక. రంగారావు కవితల్లో సూర్యుడి ప్రస్తావన తరచుగా కనిపిస్తుంది. ఆయన కవితల సంపుటాల శీర్షికల్ని గమనించినా ఈ విషయం తేటతెల్లం అవుతుంది. "ఉగాది అంటే ఉషోదయంలోని తొలి కిరణం/ అందుకే ఏటా ఉగాదికి చెబుతూంటా స్వాగతం" అన్నారు.

ఉగాదికి పంచాంగ పఠనం రివాజు. పురోహితుడు ఆదాయ వ్యయాలను రాశులవారీగా వివరిస్తుంటాడు. ఉగాదికి పంచాంగ పఠనంతో పాటు కవి సమ్మేళనాలు జరుగుతుంటాయి. కవులు తమ కవితల్లో ఉగాదికి స్వాగతం పలుకుతుంటారు. "కవిగారి పంచాంగ పఠనం" ఖండికలో "కష్టపడే వాడెప్పుడు నష్టపోతూనే ఉంటాడు/ దోచుకొనే వాడెప్పుడు దాచుకుంటూనే ఉంటాడు/ శ్రమ జీవులకు ఆదాయం రెండు/ ఖర్చు పన్నెండు" అంటూ సమాజ వ్యవస్థలోని కష్టజీవి ఎపుడూ నష్టపోతూ ఉండే సామాజిక వాస్తవికతను గుర్తు చేస్తున్నారు. అవినీతిపరులైన దొంగలు బాగా ధనవంతు లవ్వటం జరుగుతున్న అక్షర సత్యంగా కవిత్వీకరించారు. "నీతిని న్యాయాన్ని డస్ట్ బిన్ లో వేస్తారు/ కుళ్ళిపోయిన పండ్లలా, బూజు పట్టిన కూరల్లా" అన్నారు. సమాజంలో అవినీతిపరులు పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న వ్యవస్థలో నీతి, న్యాయం... డస్ట్ బిన్ లో పడిపోవటం వాస్తవం. నీతిని, న్యాయాన్ని సహజమైన మంచి ఉపమానాలతో చెప్పటం పాఠకుల్ని పట్టి కుదుపుతాయి. "మాతృ భాషకు రాజ పూజ్యం సున్నా, అవమానం మిన్న" అని ఆవేదన చెందారు.

"ఉగాదికి కవిత్వం రాయాలి/ తెలుగువారి గుండెల్లోకి చేరి పోవాలి" అనే అభిలాష కవిది. సమాజంలో అశాస్త్రీయ మైన మూఢ విశ్వాసాలను అధిక్షేపిస్తూ "చంకలో సైన్సు పుస్తకం ఉన్నవాడికి ఉద్యోగం రాకపోవచ్చు/ చక్కగా ఓ వాస్తు పుస్తకం ఉంటే చాలు/ జూబిలీ హిల్స్ లో ఓ ఇల్లు కొనొచ్చు" అంటూ నిరుద్యోగ స్థితినీ, వాస్తు పట్ల పెరుగుతున్న ఆదరణని వాస్తవంగా వర్ణించారు. "దుర్ముఖీ" అనే ఉగాది ఖండికలో "నీ పేరు చూసి మేం భయపడటం లేదు"అంటారు. "ధర్మారావులు ధర్మం చెయ్యడం లేదు, సత్యారావులు సత్యం చెప్పడం లే" దంటారు. కొన్ని తెలుగు సంవత్సరాల పేర్లు అనౌచిత్యంగా అనిపిస్తాయి. దుర్ముఖి, వికారి అలాంటివి. "గతంలో వచ్చిన దుర్ముఖీ! / కులం నశించా లన్న అంబేద్కరును/ బుద్ధుడి ఒడిలోకి చేర్చావు/ మళ్ళీ ఇప్పుడు నువ్వొచ్చేసరికి కులాలు నశించలేదు, ఉప కులాలు పెరిగిపోయాయి/ బుద్ధుడు మావల్ల అరిగిపోయాడు/ బుద్ధుని సిద్ధాంతాలు మా మనస్సులో కరిగిపోయాయి" అన్నారు. హిందూ మతంలోని కుల వివక్షపై పోరాడిన అంబేద్కరు దుర్ముఖి (1956)లో బౌద్ధం స్వీకరించాడు. అప్పటి నుండి ఇప్పటికీ బుద్ధుడి సిద్ధాంతాలు క్రమంగా కనుమరుగై పోయాయని కవి చింతన.










ఉగాదికి ఎండలు మండుతుంటాయి. మండుటెండలను గ్రామీణ ఉపమానాలతో చెబుతారు. "కొత్తగా పెత్తనం వచ్చిన కొత్త కుర్రాడు / కొనుక్కొచ్చిన కొత్త కోడె దూడల్లాగా / ఎగిరెగిరిపడుతూ ఎండలు/ మోగిస్తూ నిప్పుల గంటలు" అంటూ అద్భుతంగా ఎండల్ని వర్ణించారు. "వాన లొస్తేనే ప్రకృతికి పచ్చదనం/ చాన లుంటేనే పురుషులకు పచ్చ ధనం" అంటూ పచ్చదనం పదబంధాన్ని అంత్య ప్రాసగా అలవోకగా ఔచిత్యంగా అర్థవంతంగా ప్రయోగించారు. ప్రకృతి వానలతో పులకిస్తుంది. పైరు పచ్చ"దనం"తో వికసిస్తుంది. చానలు (స్త్రీలు) ఉంటేనే పురుషుల జీవితాలు శోభాయమానంగా పచ్చ"ధనం"తో ప్రకాశిస్తా యనడం అక్షర సత్యం. "నువ్వొస్తేనే వసంతం వస్తుంది/ వసంతంతో కోకిల వస్తుంది/ కోకిలతో పాటు ప్రభుత్వ కవి సమ్మేళనం వస్తుంది" అంటూ అనంత సుఖం పంచేందుకు రమ్మని ఉగాదికి స్వాగతం చెబుతారు రంగారావు. రావి రంగారావు ఉగాది వర్ణనలు విలక్షణ మైనవి, పాఠకులకు ఆహ్లాద భరితమైనవి.



-డా. పి.వి. సుబ్బారావు
9849177594

## "శుభకృత్"కు స్వాగతం!

శుభ సూచనగా
'శుభకృత్' నామంగా
అరుదెంచే ఉగాదీ!
అచ్చ తెలుగు సంవత్సరాదీ!
నీకిదే స్వాగతం!
కానీ కాస్త వింటావా
మా మనోగతం?
నీ పెద్దక్క 'శార్వరి'
కరోనా కష్టాల్లో ముంచెత్తింది!
చిన్నక్క "ప్లవ" కూడా
అవే చింతలకు వంతపాడింది!
మనసు విప్పి మాట్లాడలేని 'మాస్కు'లతో
కరచాలనం చేయరాని భౌతిక దూరాలతో
ఎడం ఎడంగానే వుంచి
దినదిన గండంగానే కాలాన్ని దొర్లించింది!
షాపుల్నీ- సినిమా హాళ్లనీ మూయించింది!
పెళ్లి సంబరాల్నీ పెల్లగించింది
మందులేని 'కరోనా'ను
మహమ్మారిగా మలచి
ఆసుపత్రుల పాలు జేసింది!
కలవరపాటుతో
కార్పొరేటు హాస్పిటళ్లలో చేరితే
రోగం మాట ఎలాగున్నా
రోజుకో లక్షశిక్షగా చెల్లింపజేసింది!
అంతేగాక
ప్రపంచాన్నంతా పదిరకాలుగా
పతనం గావించింది!
అన్ని రంగాల్నీ అధమ స్థాయికి దిగజార్చింది!
మా గుమ్మాలకు మామిడి తోరణాలుగాక
మాస్కుల్నే వేలాడదీసింది!
కావున శుభకృత్ సంవత్సరమా!
కాస్త కారుణ్యంతో నీవైనా
శుభ బహూకృత్‌లా వచ్చేయి!
మండుట ఎండల్లో మలయమారుతంలా
అందరి పాలిటి ఆరోగ్య జీవితంలా అడుగేయి!
మృగతృష్ణల ఎడారుల్లో ఒయాసిస్సులా
ఓ ఓదార్పు నిచ్చేయి!
మావిగున్నపై కోయిలలా
మా మనసులు ఆనందంగా పాడనీయి!
మళ్లీ మామూలు వాతావరణంతో
మా మనుగడ సాగనీయి!
నీనామం సార్థకమయ్యేలా
సకల శుభాల్నీ కలుగజేయి!
దినదినం పేట్రేగిపోతున్న
పెట్రోలు ధరల్ని
అంటించకుండానే మండిపోతున్న
అత్యవసర వంటగ్యాస్ ధరల్నీ
వెంటనే అణచేయి!
నిత్యావసర సరుకుల ధరల్నీ కూల్చేయి!
నిరుపేదల్ని ఆనందాల్లో తేల్చేయి!
అక్రమార్జనతో వేలకోట్లకు
పడగలెత్తినా
ఇంకా విక్రమార్కులై బుసగొట్టే
అవినీతిపరుల కోరల్ని విరిచేయి!
సామాన్యులకు సంతోషాల
సౌరభాల్ని పంచేయి!
చెలరేగుతున్న యుద్ధోన్మాదాల్ని అణచి
చెలిమి కలిమిని పెంచేయి
ఇక వేంచేయి!



- డా॥వద్దేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## శుభకృతు ఉగాది

దివ్య వసంతాల ఉగాది వేళ
భవ్య ప్రభాతాల శుభకృతుహేల
ఆరు ఋతువుల
షడ్రుచుల మేళవింపు,
నాలుగు కాలాల శుభ సుఖాల సొంపు
గున్నమావి గుబుర్ల గాత్రమై
పులకరించాయి,
ఉభయ,సంధ్యల
కబుర్ల ఆత్రమై
పలకరించాయి .
స్వాగత తోరణాలు
సౌహార్థానికి చెలిమిగా
రంగుల ముంగిళ్ళు ,
సౌభాగ్యానికి కలిమిగా
ఈయుగాది తెస్తుంది తీయందనాన్ని
ఈ పునాది ఇస్తుంది
భవ బంధనాలని
నూతన వత్సరం
వన్నెల పరిష్వంగంలో నిత్యానందమై,
అనుభూతుల భావాల సంరంభంలో
పరవశపు డెందమై,
పంచాంగ శ్రవణాల,
తెలుగు లోగిళ్ల
పుడమి విల్లుకు చిక్కిన
ప్రకృతి హ్వాయలు
మనో వాకిళ్ళ,
తలపు తలుపులను తరుముతుంది,
కొత్తదనపు ఊట
గెలుపు గడపను
తడుముతుంది ప్రతి చోటా
ఈ ఉగాది శుభకృతు
ఆకారం ధరించింది
సుముఖిగా,
శతమానం భవతిగా దీవించింది



-సముద్రాల శ్రీదేవి,
9949837743

## స్ఫూర్తిసంకల్పం

అది ఒక బాలికల ఉన్నత పాఠశాల, ఎనిమిదవ తరగతిలో సాహితి అనే అమ్మాయి చదువుతుంది. వారి తరగతి పక్కనే మరో తరగతి ఉంటుంది, ఒక తరగతి పిల్లలు అల్లరి చేస్తే ఇంకో తరగతికి ఇబ్బంది అవుతుంది అది వర్షాకాలం టీచర్ తరగతికి రాలేదు పిల్లలు బాగా అల్లరి చేస్తున్నారు. పక్క తరగతి లో ఉన్న ప్రధానోపాధ్యాయురాలు సాహితి తరగతికి వచ్చి ఏం పిల్లలు టీచర్ రాక పోతే ఇలా అల్లరి చేయాలా? పక్క తరగతికి ఇబ్బంది అవుతుందని తెలుసు కదా !

ఏదయినా సబ్జెక్టు తీసి చదువుకోవచ్చు కదా అన్నది కోపంగా, ఆమె కెమిస్ట్రీ టీచర్ ఆ పాఠశాలలో అందరికీ ఆమె అంటే చాలా భయం, చాలా బాగా పాఠాలు చెప్తుంది, అలాగే శిక్ష కూడా చాలానే ఇస్తుంది, ఆమె అంటే ఒక విధమైన భయంతో కూడిన గౌరవం ,సాహితి అయితే చాలా భయపడి పోయింది, టీచర్ అందరినీ చూస్తూ సాహితిని చూసి ఎమ్మా నువ్వు కూడా అల్లరి చేస్తున్నావా? నేను సైన్స్‌లో కొన్ని ప్రశ్నలు అడుగుతాను చెప్పండి అని అన్నది, తరగతి అంతా నిశ్శబ్దంగా అయ్యింది .

ఆమె అడిగే ప్రశ్నలకు ఎవరు కూడా సమాధానాలు ఇవ్వలేక పోయారు, అంతలో ఎమ్మా సాహితి నువ్వు చెప్పు అనే సరికి భయంతో బిగిసి పోయింది . ఇక టీచర్ సాహితీ, మీ నాన్నగారు ,అమ్మగారు ఇంట్లో బాగా చదివిస్తారు కదా ,ఏమైంది నేను ఎప్పుడు చూసిన పుస్తకాల ముందే కనిపిస్తావు ఒక్క జవాబు చెప్పటం లేదు ఎందుకు? ఆ మాటకు సాహితి ఏం మాట్లాడ లేక పోయింది.

ఆ టీచర్ సాహితి వాళ్ళ ఇంటి పక్కనే అద్దెకు ఉంటుంది. అందుకే ఇంకా చాలా భయ పడి జవాబు తెలిసి కూడా చెప్పలేక పోయింది. ఉప్పు రసాయనిక నామం సోడియం క్లోరైడ్ అని,ఉదజహరికామ్లాన్ని హైడ్రోక్లోరిక్ యాసిడ్ అంటరాని తెలిసి కూడా భయంతో చెప్పలేక పోయింది ,దాంతో టీచర్ బాగా మందలించింది. సాహితి ఆరోజు రాత్రి నిద్ర పోలేదు . పాఠశాల విషయాలు అన్నీ గుర్తుకొచ్చి బాగా బాధపడి ,చివరకు గట్టిగా ఒక నిర్ణయం తీసుకున్నది .

అది ఎంటంటే ఎప్పటి పాఠాలు అప్పుడు బాగా చదవాలని, నిజానికి సాహితి చాలా తెలివైన అమ్మాయి, వాళ్ళ నాన్న గారి సహకారంతో బాగా చదువుతుంది. ఎప్పటి పాఠాలు అప్పుడే ఒప్ప చెబుతుంది, కానీ ఆరోజు ఎందుకో ధైర్యం చాల లేదు, టీచర్‌కు జవాబులు చెప్పటానికి, ఇంకా తనకు వచ్చిన జవాబులను కూడా ధైర్యంగా బయటికి చెప్పాలి ,భయపడకూడదని నిర్ణయించుకుంది .ఆనాటి నుండి సాహితి చదువులో దూసు కెళ్తూ ఆ కెమిస్ట్రీ టీచర్ కు ప్రియ శిష్యురాలయ్యింది .

ఈ మార్పుకు ఆ టీచర్ చాలా మెచ్చుకుంది. ఎంతల అంటే పదవ తరగతిలో ఆ టీచర్ మరుసటి రోజు చెప్పే పాఠాన్ని సైతం ఒక రోజు ముందే చదువుకొని సిద్ధమయ్యేది, ఇది అర్థం చేసుకున్న ఆ టీచర్ సాహితి నువ్వు "అడ్వాన్స్ రీడింగ్" అయిపోయావమ్మా, ఇలాగే బాగా చదువాలి అని ప్రశంసించింది ,ఆ మాట తన ఇంట్లో వాళ్ళకు తెలిసి ఆ అమ్మాయి తల్లిదండ్రులు చాలా సంతోషపడి ఆ అమ్మాయిని బాగా ప్రోత్సహించేవారు. అలా మొదలైన తన ఆసక్తి దినదినాభివృద్ధి చెంది బాగా చదువుకొని ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఎంపిక అయింది. ఒకసారి ఆ టీచర్‌ను కలవటం జరిగింది.

తనను ఒక ఉపాధ్యాయురాలిగా చూసేసరికి ఆ టీచర్ చాలా సంతోషపడి ,అమ్మా సాహితి నువ్వా, మా దారిలోకే వచ్చావు ,ఈ ఉద్యోగం అన్నీ ఉద్యోగాలకు మూలం, నీకు వీలయినంత కష్టపడి చదువు చెప్పమ్మా , విద్యార్థుల్లోని అంతర్లీనంగా దాగివున్న ప్రతిభను గుర్తించి వారిలో చదువుపట్ల జిజ్ఞాసను పెంచి, స్ఫూర్తిని కలిగించి చదువుకొనేలా సహకరించు, మంచి భావితరాలు తయారయ్యేలా నీవంతుగా కృషి చేయి అని, సలహా ఇచ్చింది. అలా తన చిన్ననాటి ఉన్నత పాఠశాల టీచర్ ను కలిసి మాట్లాడి చాలా సంతోషపడింది సాహితి.

తన ఇప్పటి స్థితికి ఒక రకంగా కారణమై స్ఫూర్తిని కలిగించిన ఆ టీచర్‌కు మనస్ఫూర్తిగా నమస్కరించి ఆశీస్సులను పొందింది . తాను కూడా తన ఉద్యోగ ధర్మాన్ని ఇంకొకరికి స్ఫూర్తిని కలిగించేలా ఉండాలని నిర్ణయించుకుంది . ఆ బాటలోనే నడవాలని భావి తరాలను తయారు చేయాలని సంకల్పం తీసుకుంది.



-సంధ్య సుత్రావె
ఫోన్:9177615967

## శ్రీ శుభకృత శోభలు

ప్రకృతి పాడే పరవశ గీతిక
ఉరకలెత్తించే ఉగాది వేడుక
ఇంటింటా ఆనందాల కానుక
సుఖ దుఃఖ సమ్మిళిత నాటిక
అరాచకాల్ని పాతరేసే పాదుక
శ్రీ శుభకృత సుగంధాల వీచిక!

జీవనసారం ఇరిగిపోయి
పచ్చనాకులు పాలిపోయి
ఎండుటాకులై ఎగిరిపోయి
బోసి పోయే కొమ్మ రెమ్మలు..
ఆమని దయచేయడమేగా..
ప్రకృతి నేర్పే బతుకు పాఠాలు!

గుత్తులు గుత్తులుగా మావిళ్లు..
రాలిన చోటే మొలిచే చివుళ్లు..
లేత చిగుర్లను ముద్దాడే కోయిళ్లు..
నిండా తీపి రసపు చెరుకు గడలు..
వేప కొమ్మల్లో నవ్వుల పువ్వులు..
షడ్రుచుల జీవనతత్వ సరాగాలు !

పంటల ప్రసవ విరామానంతరం..
నేలతల్లి మళ్లీ మొలకెత్తే సన్నాహాలు
చలికి వీడ్కోలు పలికి వెచ్చదనానికే..
వృక్ష హరిత కిరీటాల శిరస్సులు
శిశిరానికే పాదాక్రాంతమైన దశలు
ఉగాది పర్వదిన శుభకృత్ లీలలు.. !

చురుకెక్కిన చమురు ధరాఘాతాలు
పుతిన్ బాంబుకు పేలిన గ్యాస్ బండలు
అనాథలైన కర్షకుల వరి కుప్పల తిప్పలు
బస్సు టికెట్లు మందు గోలీల మూల్యాలు
క్షిపణిలా చుక్కలనంటిన సరుకుల ధరలు
ఓటు చుట్టు కీచక రాజకీయాల భ్రమణలు
శ్రీ శుభకృత్ పేల్చాలి అశుభాల మూటలు!



-మధుపాళీ
9949700037

## శుభముల శుభకృతు

సకల జనుల సంతోషాలకు
శుభ సూచకమై వస్తున్నది
శుభకృత్ నామ దారి ఉగాది.

శిశిరం రాలుస్తున్న ఆకులు
ఉక్రెయిన్ రష్యా యుద్ధం లో
కూలుతున్న దేహాల శ్వాసలు.

మొండి ఆశల మోడులు
పచ్చని చిగురుల పందిళ్లు వేసి
కోయిలలను ఆహ్వానిస్తున్నవి.

యుద్ధంలో అలసి జెలన్స్కి పుతిన్లు
కోయిలల మధ్యమ స్వరాలులు విని
శాంతి చర్చలు జరుపుచుండిరి

అది నవ వసంతాగమనానికి
కోయిలలు చల్లని శాంతి సందేశమే!

ప్రకృతి ధర్మం
గ్రీష్మంలో నైనా చల్లదనం!

యుద్ధమంటే గెలుపోటములు కాదు
మానవ ధర్మాన్ని మంట కలపడమే!

నేడు కరోన తగ్గు ముఖం పట్టింది
యుద్ధానికి శుభం తెరపడబోతున్నది!

అది నీ రాక శుభసూచకమేమో!
శుభాలు చేకూర్చు ఓ శుభకృత్ ఉగాది



-పి.బక్కారెడ్డి
9705315250

## శిశిర వసంతం!

అసలే ఆకు రాలు కాలం
ఒంటి నిండా ధూళి
కంట్లో నలకలు
శిశిరం చిన్నబోయినా సరే
వసంతం ఆగమనాన్ని సూచిస్తుంటే
మనసు గంతులేయక మానుతుందా
కోయిల కూత కూనిరాగాలకు మూలమై
లేత మామిడి చిగుళ్ళు పూబిందె
కారకాలై
ఊరిస్తున్న వేపపూత మహదానందమే
షడ్రుచుల సమ్మేళనం రుచి చూసే
రోజు దగ్గర కొచ్చేసిందే...
ఎడ్లబండ్ల సంబురాలు రెండేండ్లుగ
లేకుండే
ఈయేటికి కుదురునేమొ ఆమని
యేతెంచగా
కొత్త వత్సరాన కొలువయ్యేడి
నవనాయక గణమ్ము
ఏమని వాక్రుచ్చెదరో....?
కనిపించని కణజీవుల విన్యాసం
తరిమి కొట్ట తలచెదరో
ప్లవ నామ వత్సరమ్ము ప్రపంచాన్ని
వణికించగ
వాక్సినొచ్చి కొంత వరకు
వారుణాస్త్రమేసెను
కణజీవుల
కరవాలముకడ్డునిలిచి పోరాడెను
వెన్ను జూపి ప్రస్తుతమున
వెనుకాడెను వైరసు....
రాజ్యకాంక్ష రగిలి పోయె అగ్ర రాజ్య నేతలకు
పిచ్చుక పై బ్రహ్మాస్త్రం వదలినారె చివరకు
ఉక్రెయిన్ పై పోరు ఏమగునో చివరకు
రాబోయే శుభకృతు యే శుభముల నిచ్చునో
మనదేశపు సౌభాగ్యం యేమని సెలవిచ్చునో
ఇంటి పోరు పదవి కాంక్షలెందాక సాగునో
మతపిచ్చని కొందరనిరి
అవినీతని ఎదిరించిరి
ఎవరికెవరు తీసిపోరు మద్దతిచ్చి పబ్బం
గడపెయ్యాలని మాన్యులమని చెప్పుకొనగ
చెవిపోరుసహించలేక మధ్యతరగతి
మందభాగ్యుల
భవిత యెరుగకుండిరీ...
ఫలితాంశములేమని సెలవిచ్చునో
యేతీరుగ నడుచునో....
జనం నాడి యెరుగనోళ్ళు
ఆశలపూలతో
మది దోచుకొనగ జూచుచుండ్రి....
ఆశయాల రెక్కలతో ఆకసమును జూపుచుండ్రి
ఈ వత్సర కాలగతిని
వివరించవె వత్సరమా...
శుభకృత్ వైన నీవు
శుభముల చేకూర్చుమా....!



-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్ 9866447234

## ఆనంద జీవనం

జనారణ్యవాసం
నగర ప్రజల జీవనం..
అగ్గిపెట్టెల్లాంటి అపార్టుమెంట్లు
ఇరుకిరుకు గదుల్లో కాపురాలు..
సూర్యభగవానుడు కనిపించడు
కోయిలమ్మ కూతలు వినిపించవు..
తోరణాలకు మామిడి చెట్లే లేవు
వెతికి చూసినా వేపచెట్లు కనిపించవు
ఉగాది పచ్చడి తినాలంటే
బజార్లో కొనుక్కోవాల్సిన దైన్యం..
తెలుగులో శుభాకాంక్షలు మాయం
వాట్సాపులూ ఎస్సెమ్మెస్సుల గాయం..
సంప్రదాయ దుస్తులకు స్వస్తి
జీన్సులూ చుడీదార్లతో కుస్తీ..
పంచాంగ శ్రవణాలపై లేదు ఆసక్తి
కవి సమ్మేళనాలపైనా అనురక్తి..
పదిమందితో సరదాగా గడిపేవారెందరు
ఇల్లంటే లోకమనుకునేవారే అందరూ..
అందరి మంచీ ఆకాంక్షించు
ఆప్యాతానురాగాలు పంచు..
ఆనందకర జీవనానికి నాంది
కొత్త ఆశల శుభకృత్ ఉగాది..



-చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ,
9440587567

## ఉగాది

ప్రకృతి పండుగ
వసంత పండుగ
షడ్రుచుల ఐక్యత
పచ్చడి పండుగ
ఆరోగ్య పండుగ
తెలుగోళ్ళ తొలి పండుగ,
కవులకవిత్వం .
ఆరంభం పండుగ
శ్రీరామనవమి
నవరాత్రుల పండుగ
యుగ ఆరంభం
ఉగాది పండుగ
సృష్టి శ్రీకారం
బ్రహ్మ దేవుని పండుగ
లేత చిగుళ్ళు
మెసవిన
కోయిలల
కుహూ కుహూ
స్వర పలుకుల పండుగ
అందరి....ఆనంద పండుగ
అమృత భారతీ
స్వాతంత్ర్య పండుగ
భారత భాగ్య విధాత పండుగ
ఆబాల గోపాల
సుఖ శాంతుల
శుభమ్ పండుగ
తెలుగు వారందరికీ
నూతన సంవత్సర
శుభకృత్తు నామ
ఉగాది పండుగ
శుభాకాంక్షలు.



- యెల్ది సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

## వింత గొడవ

(కథ)

ఒకసారి మల్లె పూలు అమ్మే బసవన్న అమాయకుడైన రామయ్య ఇంటికి వచ్చి" పూలు తీసుకుంటావా!" అని ప్రశ్నించాడు. అప్పుడు రామయ్య ఆ మల్లెపూల వాసన చూసి తనకు వద్దని చెప్పాడు .వెంటనే బసవన్న ఆ పూలను వాసన చూసినందుకు తనకు డబ్బులు ఇవ్వమని అన్నాడు. రామయ్య " వాసన చూసినందుకు డబ్బులు ఇవ్వడం ఏమిటి? నేను నీ దగ్గర పూలను కొనలేదుగా! అని అన్నాడు. "అదంతా నాకు తెలియదు. నువ్వు పూలను వాసన చూశావు. అది కూడా మొత్తం బుట్టను వాసన చూశావు. కనుక బుట్టలోని ఒక్కొక్క పువ్వుకు ఒక్క రూపాయి చొప్పున కట్టి ఇవ్వాల్సిందే" అని అన్నాడు. రామయ్య "నేను ఇవ్వను.నా వద్ద డబ్బు లేదు " అని అన్నాడు .

ఇంతలో మొక్కజొన్న కంకులు అమ్మే పైడిరాజు వచ్చి తన కంకులను తీసుకోమని అడిగాడు. అతని మోసం తెలియని రామయ్య ఆ కంకుల బూరును తీసి విత్తులు ఎన్ని ఉన్నాయోనని పరిశీలించాడు. ఆ విత్తులు తక్కువగా ఉండడం చేత రామయ్య తాను ఆ కంకులను కొనలేనని పైడిరాజు తో చెప్పాడు. అప్పుడు పైడిరాజు "నా కంకులను చేతితో ముట్టావు. ఆ కంకులపై తొడుగును కూడా లాగావు. నీవు మొత్తం ఐదు కంకుల బూర్లను లాగావు. గనుక ఒక కంకికి ఐదు రూపాయల చొప్పున చెల్లించు" అని అన్నాడు. అప్పుడు రామయ్య "నేను చెల్లించడం కుదరదు.నా వద్ద డబ్బు లేదు " అని అన్నాడు.

మరి కొద్ది సేపటికి ఒక మామిడి పళ్ళ ముత్తన్న వచ్చి పళ్ళు చాలా బాగున్నాయని వాటిని తీసుకోమని రామయ్యను కోరాడు. అవి తియ్యగా ఉన్నవి, లేనివి తనకు తెలుపమని అన్నాడు రామయ్య. అప్పుడు ముత్తన్న ఒక పండు రసాన్ని పిండి రామయ్యకు రుచి చూపించాడు .రామయ్య ఆ రసాన్ని రుచి చూసి ఈ పళ్లు పుల్లగా ఉన్నాయని తనకు వద్దని అన్నాడు. అప్పుడు ముత్తన్న "నా పండును రుచి చూసావు కనుక నాకు పది రూపాయలు చెల్లించు" అని అన్నాడు. లేకుంటే ఒక పండుకు ఇరువది రూపాయలు చొప్పున చెల్లించి వీటిని మొత్తం తీసుకోమని అన్నాడు. రామయ్య తాను నయాపైసా ఇచ్చేది లేదని తేల్చి చెప్పాడు. ముగ్గురూ కలిసి వాదనకు దిగారు.

అప్పుడే రామయ్య ఇంటి ముందు నుండి వెళ్లుతున్న గ్రామాధికారి ధర్మయ్య ఆ గొడవను చూసి రామయ్య ఇంటి లోపలికి వచ్చి ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించాడు. అప్పుడు బసవన్న తన మల్లె పూలు కొనకుండా ఈ రామయ్య బుట్టలోని పూలు అన్నింటిని వాసన చూశాడని, అందువల్ల తనకు వంద రూపాయలు చెల్లించాలని కోరితే ఇవ్వడంలేదని అన్నాడు. వెంటనే పైడిరాజు తన మొక్కజొన్న కంకులను బూరు లాగి చూశాడని వాటిని అతడు తన చేతితో తాకినందుకు తనకు డబ్బులు ఇవ్వమని అంటే ఇవ్వనంటున్నాడని తెలిపాడు .ఆ తర్వాత ముత్తన్న తన మామిడి పళ్లు ఎలా ఉన్నాయని అతడు అడిగితే తాను ఒక పండును రసం పిండి చూపించానన్నాడు. వాటిని కూడా కొనడం లేదని రుచి చూసినందుకు డబ్బులు ఇమ్మంటే ఇవ్వడం లేదని అన్నాడు.

గ్రామాధికారి రామయ్యను ప్రశ్నిస్తే "అయ్యా! వీరు అధిక ధరలు చెబుతున్నారు. అందువల్ల నేను కొనడం లేదు. కానీ వాసన చూసినందుకు, బూరు లా గినందుకు,మామిడి పండు ఒక చుక్కరుచి చూసినందుకు నన్ను డబ్బులు ఇవ్వమని అంటున్నారు. ఇదెక్కడి న్యాయం !మీరే చెప్పండి"అని అన్నాడు . ఇదంతా విన్న ధర్మయ్య వారితో "సరే! మీరు అన్నట్లు మీకు రామయ్య డబ్బులు ఇస్తాడు. కానీ రామయ్య ఇంటిలోకి మీరు అనుమతి లేకుండా ప్రవేశించి అరగంట నుండి మీరు ముగ్గురూ ఇక్కడే తిష్ట వేశారు. ఆ అరగంట కూడా మీరు ఆయన ఇంటి వసారాలోనే గడిపారు . ఇది నిజమా! కాదా! చెప్పండి. కాబట్టి ఈ ఇంటి వాకిలి అద్దె ఖరీదు ఒక నిమిషానికి వంద రూపాయలు. ఇప్పుడు భూముల విలువ చాలా ఎక్కువగా ఉందని మీకు తెలుసు. అందువల్ల ముప్పై నిమిషాలకు మూడు వేల రూపాయలు అద్దెను మీరే అతనికి చెల్లించాలి. అతడి భూమిలోనే మీరు ఉన్నారు కాబట్టి ఆ ధరను చెల్లించాల్సిందే. మీరు అతని నేలను తొక్కారు. అందువల్ల వెంటనే ఆ డబ్బులు చెల్లించండి "అని అన్నాడు .ఆ మాటలకు ఆ ముగ్గురు మోసగాళ్లు అవాక్కయ్యారు. తమను క్షమించమని గ్రామాధికారిని వేడుకొన్నారు.

అప్పుడు గ్రామాధికారి "ఏం లేదు. మీ వద్ద డబ్బు ఇప్పుడు లేకుంటే ప్రత్యామ్నాయంగా మీరు తెచ్చిన ఆ సరకును రామయ్యకు అప్పగించండి. "అని తీర్పు చెప్పాడు. అది విన్న ముగ్గురు మోసగాళు రామయ్యకు తమ సరుకులు అప్పగించి నిరాశతో వెనుదిరిగారు. అందుకే అతి తెలివితో అమాయకులను మోసం చేయాలని చూస్తే వారే మోసపోతారు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

